క్లుప్తంగా

అనర్హులకు అవకాశం ఇవ్వొద్దు..

ఇల్లెందురూరల్: ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలలో అనర్హులకు అవకాశం ఇవ్వొద్దని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయా పథకాల పురోగతిపై గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల సహాయంతో ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేయాలన్నారు. గతంలో రుణాలు తీసుకున్నవారు, ఇతరత్రా నిబంధనలకు విరుద్ధంగా దరఖాస్తులు ఉంటే జాబితా నుంచి వారి పేర్లను తొలగించాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల అర్హుల రెండో జాబితాను సిద్ధం చేశామని చెప్పారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న కీర్తి చంద్రికారెడ్డి

ఇల్లెందు: ఇల్లెందు కోర్టులో కక్షిదారులకు వేసవి తాపం తీర్చేందుకు జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రికారెడ్డి చేతుల మీదుగా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. గురువారం ఇల్లెందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుదూర ప్రాంతాల నుంచి వాయిదా కోసం వచ్చే కక్షిదారులు దాహంతో అల్లాడుతుంటారని, అలాంటి వారికి ఈ మజ్జిగ ప్యాకెట్లు ఉపశమనం కలిగిస్తాయన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, కీర్తికార్తీక్, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఐటీయూ మండల కార్యదర్శిగా జగన్



సుజాతనగర్: సీఐటీయూ సుజాతనగర్ మండల కార్యదర్శిగా మంగపేట గ్రామానికి చెందిన గుగులోత్ జగన్‌ను ఎన్నుకున్నారు. గురువారం సుజాతనగర్‌లో జరిగిన మండల మహాసభలో 15 మందితో నూతన కమిటీని ప్రకటించారు. చిన్నతనం నుంచే వామపక్ష భావజాలం కలిగిన జగన్ విద్యార్థి, యువజన రంగాల్లో పనిచేయడంతో కమిటీలో చోటు కల్పించారు. ఈ సందర్భంగా జగన్ సీఐటీయూ రాష్ట్ర, జిల్లా కమిటీలకు అభినందనలు తెలిపారు.

సమ్మెకు సీపీఎం మద్దతు

ఇల్లెందు: ఈ నెల 20న జరగనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు ప్రకటించిందని ఆ పార్టీ జిల్లా నాయకుడు ఎస్‌ఏ నబీ అన్నారు. గురువారం ఇల్లెందులో సీపీఎం మండల కమిటీ సమావేశం జరిగింది. మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాలు తలపెట్టిన ఈ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సీపీఎం శ్రేణుల సమ్మె విజయవంతం కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. కిరణ్, కృష్ణ, మోహన్‌రావు, సుల్తానా, సంధ్య పాల్గొన్నారు.

శ్రమదానం



గుంతలు పూడుస్తున్న యువకులు

పాల్వంచ: పట్టణంలోని శ్రీనివాస కాలనీకి వెళ్లే రోడ్డులో గుంతలు పడి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్పందించిన గుడిపాడు గ్రామానికి చెందిన యువకులు గురువారం శ్రమదానం చేసి గుంతలను పూడ్చారు. ఎక్సైజ్ స్టేషన్ సమీపంలో మూల మలుపు వద్ద గుంతలు ప్రమాదకరంగా మారాయి. జీఎస్‌ఎస్ రాష్ట్ర యువజన నాయకులు ఆరేం ప్రశాంత్ ఆధ్వర్యంలో గుడిపాడు యూత్ సిమెంట్, కంకర, ఇసుక తెచ్చి గుంతలు పూడ్చారు. కాలోజి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు మృతి



భద్రం (ఫైల్)

టేకులపల్లి: అనారోగ్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గాంధీపురం గ్రామానికి చెందిన పాదెం భద్రం (42) తొమ్మిది నెలల క్రితం బోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చాడు. ఆయన కొంతకాలంగా కామెర్లు, లివర్ సమస్యతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. మృతుడికి భార్య రేణుక, కుమార్తె దర్శిని, కుమారుడు డ్యానీ ఉన్నారు. భార్య పెట్రాంచెలక స్టేజీ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ టీచర్‌గా పని చేస్తున్నారు. టీఎస్ ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి, బోడు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అజ్మీర జగన్‌నాయక్, వివిధ సంఘాల నాయకులు, బోడు హైస్కూల్ ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

అరకొర జీతం.. నెలలుగా ఎదురుచూపు

- ఇబ్బంది పడుతున్న సోలార్ కార్మికులు
- పట్టించుకోని సింగరేణి కాంట్రాక్టర్



పనులు లేక సోలార్ ప్లాంట్ ముందు కాంట్రాక్ట్ కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): దేవుడు వరమిచ్చినా... పూజారి అడ్డుకున్న చందంలా ఉంది సింగరేణిలో సోలార్ కాంట్రాక్టర్ల పనితీరు. వేతనాలు కంపెనీ ఎప్పటికప్పుడు కంపెనీ చెల్లిస్తున్నప్పటికీ సదరు కాంట్రాక్టరు వేతనాలు చెల్లించటంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఒకటి, రెండు కాదు ఏకంగా మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించటం లేదని సోలార్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు వాపోతున్నారు. అసలే ఇచ్చేది అరకొర వేతనం వాటిలో మూడు నెలల వేతనం ఇవ్వకపోతే తామేమి తినాలని కాంట్రాక్ట్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా సింగరేణి ప్రాంత మారుమూల ఏరియాలో కాదు... కార్పొరేట్ ఏరియాకు కూత వేటు దూరంలోని కొత్తగూడెం ఏరియాలోని 10.5 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌లో పనిచేసే గ్రాస్ కార్మికుల దుస్థితి. సింగరేణి సంస్థ తన పరిధిలోని ఏ విభాగంలోనైనా కార్మికుల అవసరాన్ని బట్టి టెండర్ ఆహ్వానించి కాంట్రాక్టర్లకు కట్టబెట్టి, కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు చెల్లిస్తుంది. టెండర్ పొందిన కాంట్రాక్టర్ నెలంతా పనిచేసిన కార్మికులకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. కానీ మూడు మాసాలైన వేతనాలు చెల్లించకపోవటం పట్ల కార్మికులు ఇటీవల అందోళన చేశారు. ఇదిలా ఉండగా, టెండర్ పొందిన కాంట్రాక్టర్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లిస్తున్నారా.. లేదా అని పర్యవేక్షించాల్సిన అధికారులు వ్యవహరిస్తున్న తీరు కాంట్రాక్టర్‌కు మరింత ఆజ్యం పోసినట్లు అవుతుందని వాపోతున్నారు. ఇదిలా ఉండగా కాంట్రాక్టర్... కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించపోతే, ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా సింగరేణి సంస్థ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించి, కాంట్రాక్టర్ బిల్లు నుంచి వసూలు చేయాలని డీవైసీఎల్సీ కంపెనీ ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ యాజమాన్యం వాటిని తుంగలో తొక్కి కాంట్రాక్టర్లకు వేతనాలు చెల్లించటంలో నరకం చూపిస్తున్నారని కార్మికులు వాపోతున్నారు. అంతేకాకుండా జీతాలు ఇవ్వమని కాంట్రాక్ట్ కార్మికులు అడిగినందుకు నెల రోజుల నుంచి పనులు నిలిపివేసి, కంపెనీ బిల్లులు ఇవ్వటం లేదు. బిల్లులు ఇచ్చిన తరువాత పని ఇస్తానని చెప్పటం గర్హనీయమని, నెల రోజులుగా పనులు లేవన్న విషయం తెలిసిన ఉన్నతాధికారులు స్పందించకపోవటం గమనార్హం.

ఈ విషయమై డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులును వివరణ కోరగా.. సంస్థలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతీనెల 7వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని నిబంధనలు ఉన్నాయి. కాంట్రాక్టర్ చెల్లించని పక్షంలో ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా సింగరేణి చెల్లించి, కాంట్రాక్టర్ బిల్లులో రికవరీ చేయాలి. మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోతే కాంట్రాక్టరును బ్లాక్ లిస్ట్‌లో పెట్టాల్సి ఉంది.

జీతాలు ఇవ్వకుంటే ఎలా తినాలి...



సంస్థలో పర్మనెంట్ కార్మికుడికి, అధికారులకు ప్రతీనెల 3న, కాంట్రాక్ట్ కార్మికులకు 7వ తేదీన వేతనాలు చెల్లించాలి. ఈ విషయం అధికారులకు తెలిసినా.. పట్టించుకోకపోవడం సరైంది కాదు. నెలల తరబడి వేతనాలు చెల్లించకపోతే ఏం తింటారు.. కుటుంబాన్ని ఎలా పోషించుకుంటారు.

– మొగిలిపాక రవి, బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షులు

కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి...



కంపెనీ పోక్యూర్‌మెంట్ నిబంధనల ప్రకారం ఏ కాంట్రాక్టరైనా సకాలంలో పనులు పూర్తిచేయకపోయినా, కాంట్రాక్ట్ కార్మికులకు రెగ్యులర్‌గా మూడు నెలలు జీతాలు చెల్లించకపోయినా బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి. అదేవిధంగా కార్మికుల వేతనాలకు వడ్డీ ఇచ్చేలా నిబంధనలు సవరించాలి.

– పి.సతీష్, టీయూసీఐ రీజియన్ కార్యదర్శి

అడిగితే పనులు నిలిపివేస్తున్నారు..



పనిచేసిన కార్మికులకు వేతనాలు ఇవ్వాల్సిన బాధ్యత కాంట్రాక్టర్‌ది. మూడు మాసాలుగా వేతనాలు ఇవ్వకపోవటంతో పాటు, బిల్లులు రావటం లేదని పనులు నిలిపివేయడం సింగరేణిలో కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతోందని, ఏరియా అధికారులు స్పందించి కార్మికులకు న్యాయం చేయాలి.

– గట్టయ్య, ఏఐటీయూసీ నాయకులు

ప్రజా సమస్యలు పరిష్కరించండి..



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు పరిమితం చేస్తున్నారని విమర్శించారు. జిల్లాలో 2.5 లక్షల మంది రైతులు రుణమాఫీకి అర్హత ఉంటే 1.80 లక్షల మందికి మాత్రమే వర్తింపజేశారన్నారు. రైతు బీమా, రైతు భరోసా, వ్యవసాయ భూములకు పట్టా పహాణి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లు లేని కారణంగా పారిశుద్ధ్య, అభివృద్ధి పనులు, తాగునీటి సమస్యలు ఉన్నాయని, ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని కోరారు. రాజీవ్ యువ వికాసం పథకంలో సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా రుణం మంజూరు చేయాలన్నారు.

సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించి, మిగిలిన పనులను పూర్తిచేసి రైతుల సాగుభూములకు నీరందించాలని విన్నవించారు. ఇటీవల కురిసిన వర్షం కారణంగా నష్టపోయిన మామిడి, వరి రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పామాయిల్ రైతులకు సబ్సిడీపై డ్రిప్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాళ్ల సోమసుందర్, ముస్కు శ్రీనివాసరెడ్డి, పాడియం బాలరాజు, తాటిపాముల అయిలయ్య, జి.శ్రీనివాస్, బుడగం రవి, వై శ్రీనివాసకుమార్, భూక్యా సీతారాం నాయక్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో 24వ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రోహిత్ శర్మ, కొండపల్లి సాయి, శ్రావణ్ తెల్లవారుజామున కాగడ హారతి, గోదావరి జలాలతో బాబాకు అభిషేక పూజలు, శిఖరానికి సప్తజలాలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై బాబాను దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. పూజ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు ఎరుకల వెంకటేశ్వర్లు, వల్లపు యాకయ్య, బంగారు సాంబమూర్తి, మిరియాల కమలాకర్, అశోక్‌బాబు, సాయిప్రసాద్, కొత్త వెంకట్‌రెడ్డి భక్తులు పాల్గొన్నారు.

క్వారీ హద్దుల కోసం జాయింట్ సర్వే



మ్యాప్‌ను పరిశీలిస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు

జూలూరుపాడు: గుండెపుడి రెవెన్యూ పరిధి వీరభద్రాపురం గ్రామ సమీపంలోని క్వారీలో హద్దులు నిర్ధారించేందుకు గురువారం మైనింగ్, రెవెన్యూ శాఖ అధికారులు జాయింట్ చేపట్టారు. అనుమతులు ఒకచోట, తవ్వకాలు మరోచోట జరిపారన్న ఆరోపణలపై అధికారులు సర్వే చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మెటల్ క్వారీలో తవ్వకాలు జరిపి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టడంతో క్వారీ యజమానికి మైనింగ్ శాఖ అధికారులు రూ.21.61 కోట్ల జరిమానా విధించారు. క్వారీ యజమాని స్పందించకపోవడంతో రెవెన్యూ రికవరీ యాక్ట్ ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీని రికవరీ చేసేందుకు ఇటీవల తహసీల్దార్ నోటీసులు అందజేశారు.

ఈ క్రమంలో జూలూరుపాడు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ఆదినారాయణ, మైనింగ్‌శాఖ ఇన్‌స్పెక్టర్ పరుశురామ్, సర్వేయర్లు పూర్ణ, ప్రవీణ్ గుండెపుడి రెవెన్యూ రికార్డులు, మ్యాప్‌ను పరిశీలించారు. మైనింగ్ సరిహద్దులను గుర్తించేందుకు అటవీ భూముల రక్షణ కోసం ఫారెస్ట్ అధికారులు తవ్విన ట్రంచ్, సరిహద్దు రాళ్లను గుర్తించారు. ఈ విషయంపై తహసీల్దార్ కె.స్వాతిబిందును వివరణ కోరగా... క్వారీ యజమాని రత్నకు కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ రికవరీ యాక్ట్ (ఆర్‌ఆర్) ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీని రికవరీ చేసేందుకు ఇటీవల నోటీసులు జారీ చేశామన్నారు. కచ్చితమైన క్వారీ సరిహద్దులు నిర్ణయించేందుకు మైనింగ్, రెవెన్యూ శాఖ జాయింట్ సర్వే నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు.

ఇందిరమ్మ ఇల్లు మో'డల్'



టేకులపల్లిలో పూర్తి కాని ఇందిరమ్మ మోడల్ ఇల్లు

టేకులపల్లి: తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించింది. నిరుపేదల సొంతింటి కలను నిజం చేయాలనే ఉద్దేశంతో ఇళ్లను మంజూరు చేస్తోంది. ఇదిలా ఉండగా తక్కువ ఖర్చుతో ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకునేందుకు ప్రజలకు చూపించేందుకు ప్రతీ మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణం చేపట్టారు. లబ్ధిదారుల ఎంపిక జరగకముందే మోడల్ ఇంటి నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. డిసెంబర్ 23న టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎమ్మెల్యే కోరం కనకయ్య శంకుస్థాపన చేశారు. నెల రోజుల్లో ఇంటి నిర్మాణం పూర్తవుతుందని ప్రకటించారు. రెండు నెలలు తరువాత మార్చిలో పునాదులు తవ్వారు. ఏప్రిల్‌లో బేస్‌మెంట్, స్లాబ్ లెవెల్ వరకు నిర్మాణం చేపట్టారు. ఇక అంతే.. గ్రహణం పట్టింది. నేటికీ మోడల్ ఇంటి నిర్మాణం పూర్తి కాలేదు. కానీ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక చేయడమే కాకుండా పలుచోట్ల ఇంటి నిర్మాణాలు కూడా మొదలుపెడుతుండటం గమనార్హం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 21 మండలాల్లో ఇందిరమ్మ మోడల్ ఇళ్ల పరిస్థితి ఆశాజనకంగా లేదు. మొత్తం 21 మండలాల్లో ఇంకా ఐదారు ఇళ్లులు పూర్తి చేయాల్సి ఉంది. మిగిలినవి స్లాబ్ లెవెల్ పూర్తి చేసుకుని చివరి దశలో ఉన్నాయి. దీనిపై హౌజింగ్ ఏఈ డేవిడ్‌ను వివరణ కోరగా... కాంట్రాక్టర్ మధ్యలో వెళ్లిపోవడంతో మరో కాంట్రాక్టర్‌కు పని అప్పగించాం. దీంతో ఆలస్యం అయింది. ఈనెలలో ఇంటి నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు.

మహిళల రక్షణకు పనిచేస్తాం..



మహిళలకు అవగాహన కల్పిస్తున్న షీ టీమ్

చుంచుపల్లి: మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టేలా విద్యానగర్‌లోని జీవీ మాల్‌లో పనిచేస్తున్న మహిళలకు జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాల మేరకు షీటీమ్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. షీటీమ్ ఎస్సై రమాదేవి మాట్లాడుతూ.. మహిళల రక్షణ కొరకు షీటీమ్ బృందం పనిచేస్తుందని, ఎలాంటి సమయాల్లో అయినా మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా మహిళలపై ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, ఫాలోయింగ్, కామెంట్లు, రాంగ్ కాల్స్, రాంగ్ మెస్సేజ్‌లు వంటివి చేసినా, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి సామజిక మధ్యమాలలో గానీ ఇంకే విధంగానైనా ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని, మహిళకు న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు. మహిళలు ఫిర్యాదు ఇవ్వాలనుకుంటే 8712682131 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షాపింగ్ మాల్ సూపర్‌వైజర్ రమేష్, హెడ్‌కానిస్టేబుల్ నాగయ్య, కానిస్టేబుల్ రాంబాబు హోంగార్డ్ రాజు పాల్గొన్నారు.

ఏరియాలో డైరెక్టర్ పర్యటన



బొగ్గు ఉత్పత్తిని పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె.వెంకటేశ్వర్లు పర్యటించారు. గురువారం జేకే ఓసీ, కేఓసీలో పర్యటించిన ఆయన బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా లక్ష్యాలను అధిగమించాలని అధికారులకు సూచించారు. ఇల్లెందు ఏరియా బొగ్గు ఉత్పత్తి స్థితిగతులను ఏరియా జీఎం వీసం కృష్ణయ్య వివరించారు. ఆయన వెంట సింగరేణి అధికారులు గోవిందరావు, కృష్ణమోహన్‌రావు, రవికుమార్, పూర్ణచందర్, శ్రీనివాస్, శివశంకర్, రామదాస్, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కారుణ్య నియామకాలకు ముఖాముఖి..

సింగరేణి ఇల్లెందు ఏరియాలో కారుణ్య నియామకాలకు గురువారం జీఎం కార్యాలయంలో ముఖాముఖి నిర్వహించారు. మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన ఉద్యోగుల వారసులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌పీ ఇంజనీర్ క్రిష్టఫర్, నాగరాజు నాయక్, జీవీ మోహన్ రావు, సాయి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ జోక్యం గర్హనీయం



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

పాల్వంచరూరల్: ప్రజాసమస్యలను పరిష్కరించాలని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో రాజకీయ నేతల జోక్యం లేకుండా నివారించాలని, ప్రభుత్వం ప్రకటించిన ఆరుగ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న పోడుభూమి హక్కు పత్రాలను పంపిణీ చేయాలని, బంద్రుగొండ గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనుల అవకతవకలపై విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, డబ్బులను రికవరీ చేయాలని, ఆదివాసీలకు పోడు పట్టాలు, కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్నారపు కనకయ్య, అన్నారపు సత్యనారాయణ, కొండబోయిన వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి పాకాల వెంకట్రావ్, సభ్యులు సర్ప నరేందర్, పాయం నర్సింహారావు, భూక్యా లాలు, కంటే రాందాస్, శ్రీను, పద్దం భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం చూపండి..



మాట్లాడుతున్న విద్యాసాగర్

చుంచుపల్లి: వేసవికాలంలో కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డులలో తాగునీరు రాక వారం రోజులు గడుస్తున్నా మున్సిపాలిటీ సిబ్బంది గానీ, నాయకులు గానీ స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్ అన్నారు. గురువారం కొత్తగూడెంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో కిన్నెరసాని నీటి సదుపాయం ఉన్నా ప్రజల నీటి అవసరాలను తీర్చడంలో పాలక పక్షం విఫలం అయిందన్నారు. అధికారులు కూడా ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం దురదృష్టకరమని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం అమృత 2.0 పథకం కింద రూ.120 కోట్లు భద్రాద్రి జిల్లాకు ఇచ్చినా.. ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో తిమ్మిరి నరేంద్రబాబు, ఇరెల్లి నాగేశ్వరరావు, గుంపుల మహేష్, బానోత్ రాంబాబు నాయక్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నాలుగు నెలల క్రితం శంకుస్థాపన.. పనులు ప్రారంభం ఎప్పుడో?

- రూ.1.43 కోట్లతో యూపీహెచ్‌సీ నిర్మాణం
- డిజైన్‌లో స్వల్ప మార్పులు
- అనుమతిపై అనుమానాలు





అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణం జరగనున్న స్థలం (ఇన్‌సెట్) శిలాఫలకం

ఇల్లెందు: ఇల్లెందు పట్టణానికి మంజూరైన అర్బన్ హెల్త్ ప్రైమరీ సెంటర్ (యుపీహెచ్‌సీ) నాలుగు నెలలైనా పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. 2025 జనవరి 23న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. ఆ నాటికి మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం ముగుస్తుందని ఆఘమేఘాల మీద శంకుస్థాపన చేశారు. కానీ నేటి వరకు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. రూ.1.43 కోట్ల నిధులతో చేపట్టనున్న ఈ పనులకు టెండర్ కూడా పూర్తయింది. అయితే అగ్రిమెంట్ జరగలేదు. ఈ నూతన భవనంలో స్వల్ప మార్పులు చేస్తూ అప్రూవల్ కోసం ప్రభుత్వం వద్దకు ఫైల్ పంపించారు. డిజైన్ చెక్ చేసి ఎస్‌ఈ అనుమతి కోసం వరంగల్ ఎస్‌ఈ కార్యాలయానికి ఫైల్ చేరింది. ఎస్‌ఈ అనుమతి వస్తే అప్పుడు అగ్రిమెంట్ జరిగే అవకాశం ఉంది. ఇల్లెందు పట్టణంలో 100 పడకల ఆస్పత్రి, రెండు బస్తీ దవఖానాలు ఉన్నాయి. వీటికి తోడు ఒక అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ కూడా మంజూరు కాగా నిర్మాణానికి గ్రహణం పట్టుకుంది. నాలుగు నెలలైనా పనులు మొదలు కాకపోవడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఆది నుంచి అన్నీ అడ్డంకులే..

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణం తొలుత ఇల్లెందులపాడులో నిర్మించాలని తలపెట్టారు. కానీ రాజకీయ కారణంగా భూ కేటాయింపులో వివాదం తీవ్రమైంది. దీంతో కోర్టు ఏరియాకు మార్చారు. శంకుస్థాపన కూడా పూర్తి చేశారు. అయితే అక్కడ కూడా ఈ సెంటర్ నిర్మాణం ముందుకు సాగటం లేదు. తాజాగా డిజైన్ మార్పుతో అసలుకే ఎసరు వచ్చినట్లు అయింది. ఆ డిజైన్ అప్రూవల్ అయ్యేదెప్పుడో పనులు ప్రారంభమయ్యేదెప్పుడో అంతుపట్టటం లేదు. డిజైన్ మార్పు ప్రక్రియలో వర్షాకాలం నెత్తిమీదకు వస్తోంది.

అర్బన్ హెల్త్ సెంటర్ వల్ల ఉపయోగాలు..

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వల్ల ఏరియా ఆస్పత్రి మీద భారం తగ్గుతుంది. ఇప్పటికే ఇల్లెందు మున్సిపాల్టీలో రెండు బస్తీ దవాఖానాలు ఉన్నాయి. ఇక అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వల్ల ఇద్దరు డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్లు ఇతర సిబ్బంది ఉంటారు. రూరల్‌లో పీహెచ్‌సీ తరహాలోనే అర్బన్‌లోనూ ఈ పీహెచ్‌సీ పని చేస్తుంది. దీని పరిధిలో సబ్ సెంటర్ల వైశాల్యం తక్కువ నిడివిలో ఉంటాయి. దీనివల్ల ఏరియా ఆస్పత్రి మీద భారం తగ్గే అవకాశం ఉంది. డీఎంహెచ్‌ఓ పర్యవేక్షణలో సాగు ఈ భవనం ఈ ఏడాది అయినా పనులు ప్రారంభం అవుతాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

పనులు ప్రారంభించాలి..



శంకుస్థాపన జరిగిన నాలుగు నెలలు అవుతోంది. నేటి వరకు పనులు మొదలు కాలేదు. రకరకాల కారణాలతో జాప్యం జరుగుతోంది. తక్షణం పనులు ప్రారంభం అయ్యేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలి.

– యాకుబ్‌షావలీ, ఇల్లెందు

స్టీల్ డిజైన్ రావాల్సి ఉంది..



ఇల్లెందు కోర్టు ఎదురుగా నిర్ణయించిన ఖాళీ ప్రదేశంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణం జరగనుంది. డిజైన్ అప్రూవల్, సాయిల్ టెస్ట్ కూడా అయింది. స్టీల్ అప్రూవల్ రావాల్సి ఉంది. రాగానే పనులు ప్రారంభం అవుతాయి.

– సీహెచ్. శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్